క్లుప్తంగా

బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

ఎస్‌ఐ పోచయ్య



మాట్లాడుతున్న ఎస్‌ఐ పోచయ్య

రేగోడ్(మెదక్): బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ పోచయ్య అన్నారు. మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో తాటిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కళాబృందం సభ్యులు ఐపీఎల్ బెట్టింగ్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలలకు సెలవులు వస్తున్న సందర్భంలో తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని చెప్పారు. ప్రయాణాలు చేసేటప్పుడు బంగారు ఆభరణాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కళాబృందం సభ్యులు సురేందర్, ఇసాక్ తదితరలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేసేది కేంద్రం

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్



వెల్మకన్నలో రేషన్‌షాప్ వద్ద ప్రధాని ఫొటో పెట్టి ఉచిత బియ్యం అవగాహన కల్పిస్తున్న రాజేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తుందని కేంద్ర ప్రభుత్వం అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. శనివారం మండలంలోని వెల్మకన్నలో రేషన్‌షాపు వద్ద పీఎం నరేంద్రమోదీ చిత్రపటాన్ని పెట్టి గ్రామస్తులకు రేషన్ బియ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం కేంద్ర ప్రభుత్వం కరోనా నుంచి రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాగౌడ్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి అశోక్, కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు బాలింగం, రాజు, ప్రకాష్, శేఖులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పల్లకీసేవ



గజవాహనంపై ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం గజవాహనంపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. దారి పొడువునా మహిళలు, భక్తులు ఉత్సవ విగ్రహాలకు మంగళహారతులతో స్వాగతం పలికారు. సాయంత్రం ఎదుర్కోలు నిర్వహించారు. ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

పరిశ్రమ సహకారంతో రైతు వేదిక నిర్మాణం



నవాబుపేటలో నిర్మించిన రైతు సంఘం

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు ఒకచోట కలిసి సాగు విధానం, ఇతర అంశాల గురించి చర్చించుకునేందుకు పరిశ్రమ సహకారంతో రైతు భవనం నిర్మించారు. మండల పరిధిలోని నవాబుపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఫ్లెమింగ్ లాబోరేటరీస్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో రైతు సంఘం భవనం నిర్మించారు. రైతులు చర్చించుకునేందుకు గ్రామంలో అనువైన ప్రదేశం లేకపోవడంతో గ్రామస్తులు పరిశ్రమ యాజమాన్యానికి దృష్టికి తీసుకెళ్లడంతో రైతుల కోసం భవన నిర్మాణానికి ముందుకొచ్చారు. భవన నిర్మాణం పూర్తికావడంతో రైతులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే రైతు భవనాన్ని ప్రారంభించి రైతులకు అప్పగించనున్నట్లు ఫ్లెమింగ్ లాబోరేటరీస్ ఎండీ ప్రకాష్ అన్నారు.

యుద్ధవిద్యల్లో బాలికల ప్రతిభ

- జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన కేజీబీవీ బాలికలు
- శిక్షణతో బాలికల్లో పెరిగిన ఆత్మస్థైర్యం



చిట్కుల్ కేజీబీవీలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణలో విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలకు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్, కిక్‌బాక్సింగ్ లాంటి క్రీడలు ఎంతో అవసరం. అందులో భాగంగానే ప్రభుత్వం పాఠశాలల్లో, కేజీబీవీల్లో, గురుకులాల్లో చదువుకునే విద్యార్థులకు, రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణలో భాగంగా నిపుణులతో మార్షల్ ఆర్ట్స్‌లో మూడు నెలలు శిక్షణను ఇస్తున్నారు. యుద్ధవిద్యలు తమను తాము రక్షించుకోవడంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుందనే ఉద్దేశంతో ఈ క్రీడలను పాఠశాలల్లో ప్రారంభించారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా మారుతారు. మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని కేజీబీవీలో విద్యను అభ్యసిస్తున్న పలువురు బాలికలు ఖేలో ఇండియా, సీఎం కప్, ఎస్‌జీఎఫ్‌లతో పాటు పలు జాతీయస్థాయి క్రీడలలో తమ సత్తా చాటి పతకాలు సాధించారు. ఓ వైపు చదువులో రాణిస్తునే, మరో వైపు మార్షల్ ఆర్ట్స్ శిక్షణలో నైపుణ్యాలు సాధించారు. కేజీబీవీ పదో తరగతి చదువుతున్న డి.మీనాక్షి ఖేలో ఇండియా గేమ్స్‌లో కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకాన్ని సాధించడంతో పాటు, మెదక్‌లో నిర్వహించిన సీఎంకప్ పోటీలో వెండి పతకాన్ని సాధించింది. కిక్ బాక్సింగ్‌లోనే కాకుండా పలు కుంగ్‌ఫూ పోటీల్లో సైతం మీనాక్షి సత్తా చాటింది. పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎన్. స్వప్న గత సంవత్సరం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్‌లో రెండుసార్లు వెండి పతకాలు సాధించి, రాష్ట్ర స్థాయిలో పాల్గొంది. సీఎంకప్ క్రీడల్లో జిల్లా స్థాయిలో వెండి పతకాన్ని సాధించింది. మరో విద్యార్థిని బి.పావని ఫిబ్రవరిలో సంగారెడ్డిలో నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. 9వ తరగతి చదువుతున్న ఎన్. స్రవంతి సైతం సంగారెడ్డిలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది.

బ్లాక్ బెల్ట్ సాధిస్తా



ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు ముగిశాయి. విద్యాలయంలో ఏర్పాటు చేసిన మార్షల్ శిక్షణ సరదాగా మొదలుపెట్టినప్పటికీ దానిపై ఇష్టం మరింత పెరిగింది. కుంగ్‌ఫూలో బ్లాక్‌బెల్ట్ సాధించడమే లక్ష్యం. ఉన్నత చదువులు చదువుతూనే కిక్‌బాక్సింగ్, కరాటేలో రాణిస్తా.

– మీనాక్షి, విద్యార్థిని, కేజీబీవీ చిట్కుల్

ఆత్మస్థైర్యం పెరిగింది



మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో ఎంతో ఆత్మస్థైర్యం పెరిగింది. ప్రస్తుతం పదో తరగతి పూర్తయింది. అవకాశం ఉంటే మార్షల్ ఆర్ట్స్ శిక్షణను కొనసాగిస్తా. మార్షల్ ఆర్ట్స్‌తో పాటు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నదే కోరిక.

– స్వప్న, విద్యార్థిని, కేజీబీవీ చిట్కుల్

శిక్షణ కాలాన్ని పెంచాలి



విద్యార్థులకు అందించే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కాలాన్ని మూడు నెలలు కాకుండా మరింత కాలం పెంచితే, విద్యార్థులు ఎక్కువ నేర్చుకోవడానికి అవకాశం ఉంది. మా పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌తో పాటు పలు క్రీడలు, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం గర్వంగా ఉంది.

– అంజలి, ఎస్ఓ, కేజీబీవీ చిట్కుల్



నర్సాపూర్ రూరల్: కల్యాణానికి ముస్తాబైన సీతారాంపూర్ రామగిరి క్షేత్రం



నర్సాపూర్ రూరల్: రామగిరి క్షేత్రంలో కొలువైన సీతారాములు

కల్యాణానికి ఆలయాల ముస్తాబు



ముస్తాబైన అభయ సీతారామాలయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని అభయ సీతారామాలయం 32వ వార్షికోత్సవాలతో పాటు శ్రీరామ నవమి సందర్భంగా సీతారామా కల్యాణ మహోత్సవానికి రామాలయం ముస్తాబు అయింది. ఈనెల 6 నుంచి 8 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఫణీంద్ర శర్మ, శ్రీరామ భజన మండలి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా అభయ సీతారామచంద్రస్వామికి పంచామృత అభిషేకం, గణపతిపూజ, ఎదుర్కోళ్లు, ధ్వజారోహనం, సీతారామ కల్యాణం అనంతరం అన్నదానం, పూజలు, 7న కుంకుమార్చనలు, సత్యనారాయణస్వామి వ్రతాలు, సాయంత్రం బండ్ల ఊరేగింపు, 8న ఆంజనేయస్వామికి చందన అలంకరణ, శ్రీరామ పట్టాభిషేకం, పూర్ణాహుతి, పాచిబండ్ల ఊరేగింపు, రాత్రి పల్లకీసేవ తదితర పూజలు ఉంటాయని అలయ కమిటీ, భజన మండలి సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

కల్యాణానికి ముస్తాబైన రామగిరి క్షేత్రం

నర్సాపూర్ రూరల్: మండలంలోని సీతారాంపూర్‌లో శ్రీరామగిరి క్షేత్రం ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి ముస్తాబైంది. ఇక్కడ కొలువుదిరిన సీతారాములుకు ప్రత్యేకత ఉంది. సీతారాముల వారు ఇక్కడ కొన్ని రోజుల పాటు ఏకాంతంగా గడిపినట్లు చెప్పుకుంటారు. సీతారాంపూర్ గ్రామాన్ని అనుకొని అన్న ఎత్తైన కొండపై రాముని పాదాలు ఇందుకు ఆనవాలుగా చెప్పుకుంటారు. భద్రాచలంలోని శ్రీరాముని ఆలయంలో కొలువుదీరిన సీతారాముల ఉండేలా ఇక్కడి శ్రీరామగిరి క్షేత్రం ఎదుట హనుమాన్ ఆలయం ఉంటుంది. కాకతీయుల కాలం నుంచి నిత్య పూజలతో పాటు ప్రత్యేక శ్రీరామనవమి పురస్కరించుకొని అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు చెప్తుంటారు.

కల్యాణానికి ఏర్పాట్లు

నేటి కల్యాణానికి ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు కలిసి సీతారాముల కల్యాణం కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం సుప్రభాత సేవ, గురు పూజతో పాటు తదితర ప్రత్యేక పూజలుంటాయి. అనంతరం సీతారాములు కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం హారతి తీర్థప్రసాద వితరణ మధ్యాహ్నం అన్న ప్రసాదం, సాయంత్రం బండ్ల ఊరేగింపు, పల్లకీసేవ చేస్తారు. సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, పాచిబండ్లను ఊరేగిస్తారు.

మంగళవారం శ్రీరామ మూలమంత్ర వాహనం, చండీ సప్తశతి మహాయాగం, పూర్ణాహుతి ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు న్నారు.

కేంద్ర పథకాలను రాష్ట్ర పథకాలుగా..



మాట్లాడుతున్న హరీశ్

కొల్చారం(నర్సాపూర్): ప్రజా సంక్షేమం కోసం కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాలను రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీ తమ పథకాలుగా ప్రచారం చేస్తుందని బీజేపీ మండలాధ్యక్షుడు హరీశ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి గరీబ్ అన్న యోజన కింద ఇస్తున్న రేషన్ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లుగా కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇస్తామన్న ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో నెరవేర్చింది లేదన్నారు. ప్రజల నుంచి వెలువడుతున్న ఆగ్రహాన్ని తొలగించుకోవడానికి కేంద్రం నుంచి ఇస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ నిధులను తమ నిధులుగా అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నాని, గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు కేతావత్ ఫుల్‌సింగ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు మహేశ్, రవిగౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతే ధ్యేయం

గజ్వేల్‌రూరల్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తున్నదని ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో సన్నబియ్యం పంపిణీని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, గణేశ్, కరుణాకర్, మహేశ్, నర్సింహులు, సురేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మురళీకృష్ణను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న సాయిలు, రామచంద్రం తదితరులు

చిన్నశంకరంపేట(మెదక్): దళిత నాయకుడు సంజీవయ్యతో పాటు అతని కుమారుడిపై దాడిచేసి కిడ్నాప్‌కు ప్రయత్నించిన సినీ నిర్మాత మురళీకృష్ణను వెంటనే అరెస్ట్ చేయాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయిలు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రం డిమాండ్ చేశారు. శనివారం చిన్నశంకరంపేటలో వారు మాట్లాడుతూ.. సంజీవయ్య సొంత గ్రామంలో భూములు కొనుగోలు చేసిన మురళీ కృష్ణ దళితులను బెదిరించి పొలాలను కొనేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ఇదేమని ప్రశ్నించే రౌడీలతో కలిసి దాడిచేసి, హత్య చేసేందుకు ప్రయత్నించాడన్నారు. దాడులకు పాల్పడిన మురళీ కృష్ణను వెంటనే అరెస్ట్ చేసి దళితులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు మోహన్‌నాయక్, దళిత సంఘాల నాయకులు సాయిలు, రమేశ్ ఉన్నారు.

సన్న బియ్యం పంపిణీ



చిన్నశివునూర్‌లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



కొల్చారం(నర్సాపూర్): ఎనగండ్లలో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో రేషన్ దుకాణాల ద్వారా శుక్రవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఎనగండ్లలో కాంగ్రెస్ నాయకుడు, రంగంపేట పీఏసీఎస్ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సాయిబాబా, అనంతరం దుకాణానికి చేరుకున్న బీజేపీ నాయకులు బియ్యాన్ని పంపిణీ చేశారు. కిష్టాపూర్‌లో మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్, తాజా మాజీ సర్పంచ్ గోదావరి పాల్గొన్నారు.

చిన్నశివునూర్‌లో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిన్నశివునూర్ గ్రామంలో శనివారం యూత్ కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు ఉసామొద్దీన్ ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, మోహన్, ప్రతాప్‌గౌడ్, నవీన్, సురేష్, బాబు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్లలో



రామాయంపేటలో..

జిల్లా వ్యాప్తంగా శనివారం బాబు జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. పేదలు, శ్రామికులు, సామాన్యులు, అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక సమానత్వం అందించేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.



నర్సాపూర్‌లో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు



తూప్రాన్‌లో..



పెద్దశంకరంపేటలో ..



చిన్నశంకరంపేటలో..

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

గజ్వేల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్ఎఫ్ఐ ముందుకు సాగుతుందని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మంలో జరుగనున్న తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శనివారం గజ్వేల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్పొరేటీకరణకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. మత సామరస్యం, లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యంగా విలువలకు ప్రాధాన్యతనిస్తూ, వాటి పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణయ్, సాగర్, రాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల అరణ్యంలో కొలువైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి జన్మదినం సందర్భంగా ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్త శర్మ, తదితరులు ఉన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఏదైనా ఘటన జరిగితే మత, కుల పెద్దలు ముందుకు వచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అలాగే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శ్రీరామనవమితో పాటు హనుమాన్ శోభాయాత్రను శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సీఐ సైదా, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్యతో పాటు ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయాల వద్ద అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని బాల వీరహనుమాన్ ఆలయం, కొట్టలలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గ్రామస్తులు శనివారం అన్నదానం చేశారు. గ్రామ పురోహితుడు మెట్టురాములుశర్మ ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

◆ ఆలయంలో ధ్వజ స్తంభ పూజ

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో భాగంగా శనివారం ప్రారంభ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రహ్మణులు అర్చన, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పోతేదార్ మల్లన్న, గజవాడ రాజేశ్వర్ దంపతులు పాల్గొన్నారు. ఆదివారం సీతారాముల కల్యాణం, సోమవారం ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

◆ బోరుమోటార్ కేబుళ్ల చోరీలపై విచారణ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గౌతాపూర్ గ్రామ శివారులో బోరుమోటార్ల కేబుళ్ల దొంగతనం జరిగాయన్న ఫిర్యాదుతో శనివారం కేబుళ్ల దొంగతనానికి గురైన సంఘటన స్థలాలను పరిశీలించి విచారణ చేపట్టామని ఎస్ఐ నర్సింహులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పలువురు రైతుల బోరుమోటార్ల కేబుళ్లు చోరీకి గురైన విషయమై రైతులు అందించిన సమాచారాన్ని సేకరించామన్నారు. త్వరలోనే దొంగను పట్టుకొని బాధిత రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

◆ సేవాలాల్ మాల విరమణకు బయలుదేరిన గిరిజనులు



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్దతండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ మాల ధరించిన గిరిజనులు పొరాదేవి ఆలయంలో మాల విరమణకు బయలుదేరారు. శనివారం నర్సంపల్లితండాలో సేవాలాల్ మహారాజ్, భవాని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మహారాష్ట్రలోని పొరాదేవి ఆలయం వద్ద గురు ప్రేమ్ సింగ్ మహారాజ్ సమక్షంలో మాలధారణ విరమణ చేయనున్నట్లు తండా పెద్ద బిక్యానాయక్ తెలిపారు.

◆ ఆలయం వద్ద బోరు తవ్వకం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్ గ్రామ శివారులోని కాళీమాత ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం బోరుబావి తవ్వించారు. శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు నీటి వసతి అందించడానికి ముందుకు వచ్చిన దాత వెంకట్రామిరెడ్డిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. అనంతరం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మహేశ్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, కృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పిల్లుట్ల గ్రామంలో లబ్ధిదారులకు బీఆర్ఎస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో చెక్కులు మంజూరైనట్లు బీఆర్ఎస్ నాయకులు స్వామి, దామోదర్‌రెడ్డి, వెంకటేష్, స్వామి, గణేశ్ అన్నారు.